శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# సకాలంలో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం..

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 486 అర్జీలు - కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 25, ప్రభాతవార్త** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ డిఆర్‌వో హుస్సేన్ సాహెబ్, జడ్పీ సిఇవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో సంబంధిత శాఖలు అలసత్వం వహించకూడదని తెలిపారు. ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహించాలని అదేవిధంగా వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. సమస్యల పరిష్కార విషయంలో అలసత్వం వహించిన శాఖలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 426 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 166, మున్సిపల్‌శాఖకు సంబంధించి 41, సర్వేకు 46, పంచాయతీ రాజ్ శాఖకు 66, పోలీసుశాఖకు 67, సెర్ప్‌శాఖకు సంబంధించి 12 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి సత్య ప్రసాద్‌కు జిల్లా కలెక్టర్ ఆహ్వానం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 25, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ని స్థానిక ప్రవేట్ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలసిన, పుష్పగుచ్ఛంతో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆహ్వానించారు.

# నిబంధనలకు అనుగుణంగా గణేష్ చతుర్థి ఉత్సవాలు

- ఎస్పీ జి. కృష్ణకాంత్



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** నిబంధనలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ జి. కృష్ణకాంత్ విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని వీలైనంత వరకు మట్టి గణేష్ ప్రతిమలను ప్రతిష్ఠించాలని సూచించారు. సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకి ఆర్గనైజర్స్ పూర్తి వివరములు తెలిపి పోలీసు వారి నుండి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. విగ్రహం ఎత్తు, విగ్రహం నిలుపు స్థలం, ఎన్ని రోజులు ఉంచుతారు?, మైకుకు అనుమతి, విగ్రహం నిమజ్జన ప్రదేశం, నిమజ్జనానికి వెళ్ళే రూటు తదితర పూర్తి వివరాలు పొందుపరచాలని, విగ్రహం ఉంచు స్థలం ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠ/ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా కమిటీ వారు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీలు పోలీసు శాఖ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. వేడుకల సందర్భంగా చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అన్ని శాఖలు, కమిటీల సహకారంతోనే గణేష్ చతుర్థి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించగలమని తెలిపారు. చవితి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి బలవంతపు వసూళ్లకు పాల్పడరాదు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

# మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వేమిరెడ్డి దంపతులు



**కోవూరు , ఆగస్టు 25 ప్రభాతవార్త :** నెల్లూరు తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ వ్యవహారాల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మర్యాదపూర్వ కంగా కలిశారు. నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో బస చేసిన ఆయనను ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారిరువురు వివిధ అంశాలపై కొద్దిసేపు ముచ్చటించారు. భేటీలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్లాజీస్, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జడ్ శివప్రసాద్, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# స్మార్ట్ స్ట్రీట్ బజార్ పనులను వేగవంతం చేయండి

-కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 25,ప్రభాతవార్త :** పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాజెక్టు నిర్మాణ పనులను కమిషనర్ వై.ఓ నందన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కమిషనర్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. స్థానిక రంగనాయకులపేట పినాకిని పార్కును కమిషనర్ సందర్శించి పార్కులో అవసరమైన అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు. మినీ బైపాస్ ప్రాంతంలో రోడ్డును ఆక్రమిస్తూ నిర్వహిస్తున్న నర్సరీ, వినాయక విగ్రహాల నిర్వాహకులతో కమిషనర్ మాట్లాడి ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ ఇ రామ్ మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 21663 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 57.218 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50,ఎన్ఎఫ్‌సికి 340, పెన్నా డెల్టాకు 1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.591 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# మహిళా సంక్షేమానికి పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ



- మహిళా సాధికారత. స్త్రీ శక్తితో సాకారం
- కోవూరులో వేడుకగా స్త్రీ శక్తి విజయోత్సవ సభ
- భారీగా తరలివచ్చిన మహిళా గణం
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ నినాదాలు
- మహిళా పారిశ్రామికవేత్తల కోసం MSME కంపెనీల ఏర్పాటుకు సహకరిస్తా
- ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేతిలో కోవూరు నియోజకవర్గం పదిలం ఎంపీ
- మన ఇంటి పెద్దన్న సీఎం చంద్రబాబు
- ఆస్తిలో సమాన హక్కు కల్పించిన చరిత్ర మనది
- తాత ఎన్టీఆర్ భావజాలాలను ముందుకు తీసుకెళ్తున్నారు : లోకేష్,ఎమ్మెల్యే



**కోవూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త :** మహిళా సంక్షేమానికి పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అన్న నినాదాలు హోరెత్తాయి. తరలివచ్చిన మహిళాగణంతో కోవూరు వీధులు కిక్కిరిశాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై ఆనందహేళి వెల్లివిరిసింది. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దాదాపు 5వేల మంది మహిళామణుల సమక్షంలో సోమవారం జరిగిన స్త్రీ శక్తి విజయోత్సవ సభ ఆద్యంతం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు హాజరుకాగా మహిళలు వారికి అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. అనంతరం వేదిక వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు పాలనలో జరిగిన లబ్ధిని వివరిస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పలువురు మహిళలతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మహిళా సాధికారత ఎలక్షంగా మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళా శక్తికి నిదర్శనమే ప్రశాంతిరెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడమని ఉద్ఘాటించారు. చంద్రబాబు అవకాశం ఇవ్వడం వల్లే ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యేగా తాను ఎంపీగా ఇక్కడ ఉన్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నిత్యం కోవూరు ప్రజల అభివృద్ధి గురించి ఆలోచిస్తుంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే మహిళలకు సంబంధించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని, దీని ద్వారా రూ. 3.7 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్నారని, మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను కూడా తీసుకువచ్చారన్నారు. డ్వాక్రా మహిళలకు (Self Help Groups) వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని గుర్తు చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం కార్యక్రమం కింద అకౌంట్లో 15000 జమ చేశారని, ప్రతి నెల ఒకటవ తేదీన ఇంటింటికి పెన్షన్ అందజేస్తూ ఆదుకుం టు న్నారన్నారు.

**ఎంఎస్ఎం ఈ కింద పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తా జిల్లాలో**

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఎంపీగా తనవంతు మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా మహిళలు మంచి ఆలోచనలతో ముందుకు వస్తే ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా తగిన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు ముందుకు రావాలని, అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షి ంచారు.

**ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ మహిళా**

సంక్షేమానికి పుట్టినిల్లు తెలుగుదేశంపార్టీ అని,పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు పాలన నుంచి నేటి వరకు మహిళాభివృద్ధికి కృషి చేస్తూనే ఉన్నారన్నారు. యువ నాయకులు మంత్రి నారా లోకేష్ ఆలోచనల నుంచి రూపొందించిన సంక్షేమ కార్యక్రమమే స్త్రీ శక్తి పథకమన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం అని ఎలా గుర్తుంటుందో అదే రోజు రాష్ట్ర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన స్త్రీ శక్తి పథకం కూడా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కానుకగా ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి మహిళల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగాలు, చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలతో పాటు చదువుకునే విద్యార్థినులకు స్త్రీ శక్తి పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

చంద్రబాబు నేతృత్వంలో ఉన్నది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని చాటి చెప్పేలా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సూపర్ సిక్స్ లోని 90 శాతం పథకాలు అమలు చేశారన్నారు. వచ్చే మార్చినాటికి సొంత ఇళ్ళు లేని కుటుంబాలకు 10 లక్షల ఇళ్లు నిర్మించి అక్క చెల్లమ్మలకు కానుకగా ఇచ్చే కార్యక్ర మానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టినట్టు ఆమె వెల్లడించారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలనుకునే పేద, మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో తల్లికి వందనం దోహదపడుతుందన్నారు. దీపం 2 పథకం ద్వారా ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా అందచేస్తూ లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా చేయూతనిస్తున్నారన్నారు. ఇంటికి పెద్ద కొడుకులా మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని మనసారా ఆశీర్వదించి తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని ఆమె మహిళలను కోరారు.

**పలువురికి ఘన సత్కారం**

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన పలువురు మహిళలను ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకురాలు, మాజీ ఎంపీపీ యాకసిరి వెంకటరమణమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు బండి విజయలక్ష్మి, సంఘ సేవకురాలు కె.సుభద్రమ్మ, సంఘమిత్ర పొదుపు సంఘ అధ్యక్షురాలు సిహెచ్ రమ్య, దీళీది లో 4 జాబ్స్ సాధించిన దాసరి ద్వివర్ణ లక్ష్మి, ఆశా వర్కర్ దార్ల కామేశ్వరమ్మ సన్మానం

# స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత

## గత ప్రభుత్వంలా కాకుండా లబ్ధిదారుల ఫోటోలతోనే రేషన్ కార్డులు



**ముత్తుకూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త** ముత్తుకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్మార్ట్ రేషన్ కా ర్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రా రంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జి ల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విజయకుమార్, తదితరు లుపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్ర వ్యా ప్తంగా ప్రారంభించారన్నారు. సరుకులు పొందిన, పొందని వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేటెడ్‌గా కనిపించేలా క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను సరిదిద్దేందుకు ఈ స్మార్ట్ కార్డులు దోహదం చేస్తాయన్నారు. కూటమి ప్రభు త్వం వచ్చాక ప్రజలకు సౌకర్యవంతంగా అనేక మార్పులు తీసుకొస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులు అంటూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వాహనాలను తెచ్చారు. ఆ వాహనాలు వచ్చిన సమయంలోనే రేషన్ సరుకులు తీసుకోవాలని, అవి కూడా ఇంటి వద్దకు రావు వీధిలో ఎక్కడో ఒక చోట నిలుపు తారన్నారు. వాహనాలు వచ్చిన గంటలో రేషన్ సరుకులు తీసుకోకపోతే ఇక ఆ నెలలో కట్, ఇప్పుడు కూట మి ప్రభుత్వం రేషన్ వ్యవస్థలో పాత విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఏరోజైనా రేషన్ షాపుకి వెళ్లి సరుకులు పొందవచ్చు65 ఏళ్ల పైబడిన వారు, దివ్యాం గులకు నేరుగా ఇళ్ల వద్దకే సరుకులే ఇచ్చే ఏర్పాటు చేసింది. ఒకటో తేదీకి ఐదు రోజుల ముందే వారికి సరు కులు అందజేస్తున్నారు. మొదట రేషన్ కార్డు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందే తెలుగుదేశం పార్టీ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ప్రయోజనాల కన్నా పాలకుల ఫొటోలకే ప్రాధాన్యమిచ్చారు. ఇప్పుడు మా ప్రభుత్వం కేవలం లబ్ధిదారుల ఫొటోలతోనే స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఈదురు రామ్ ప్రదీప్ కుమార్ రెడ్డి, రాగల శివకృష్ణ, పగడాల సతీష్. కలిసేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ అవకతవకలకు స్మార్ట్ కార్డులతో చెక్

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

దేశంలో ఎక్కడా లేనివిధంగా స్మార్ట్ కార్డుల పంపిణీ



**కోవూరు , ఆగస్టు 25 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత తెచ్చేలా దేశంలోనే ఎక్కడా లేనివిధంగా స్మా ర్ట్ రేషన్ కార్డులను తీసుకువ చ్చిం దని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ అ న్నారు. సోమవారం కోవూరు పంచాయతీలోని పెల్లకూరుకాలనీలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారికి ప్రభుత్వం తరఫున అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ... ప్రజా పంపిణీ వ్యవస్థలో దేశంలో ఎక్కడా లేనివిధంగా స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు నుంచి నాలుగు దశల్లో క్యూఆర్ కోడ్ తో కూడిన 1 కోటి 45 లక్షల స్మార్ట్ రేషన్ కార్డుల (Smart Rice Cards)ను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా రేషన్ సరఫరాలో అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేలా స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకువచ్చిందని వివరించారు. జిల్లాలో 7.10 లక్షల కార్డులు వచ్చాయని వివరించారు. కోవూరు నియోజకవర్గంలో 95 వేల రేషన్ కార్డులకు గాను 94 వేల స్మార్ట్ కార్డ్స్ కార్డులు వచ్చాయని వివరించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 199 రేషన్ షాపులు ఉన్నాయని, ప్రజల అవసరాలను దృష్టితో వీటి సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎవరికైనా రేషన్ కార్డులు అందకపోతే సమీప సచివాలయంలో సంప్రదించి తీసుకోవాలని సూచించారు. అధికారులు స్మార్ట్ కార్డుల వినియోగంపై రేషన్ డీలర్లకు సరైన అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. కోవూరు సర్పంచ్ విజయమ్మ, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు ఇంతా మల్లారెడ్డి, కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారం ఉందని విర్రవీగం.. చీమకు కూడా హానీ చేయం

- మా ప్రభుత్వం వచ్చాక అన్యాయాలు, అక్రమాలకు పూర్తిగా చెక్ పెట్టాం - సోమిరెడ్డి



**నెల్లూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరులోని వేదాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నేతలకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆత్మీయ ఆహ్వానం పలికిన సోమిరెడ్డి. మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన ముఖ్య నాయకులు టీడీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. వైసీపీ మండల ఉపాధ్యక్షుడు వీరంపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు తరిమెర్ల రఘురామిరెడ్డి, ఎంపీటీసీ తాటిపర్తి రాఘయ్య, వార్డు సభ్యులు పలగాని శేషరెడ్డితో పాటు 13 మంది ముఖ్య నాయకులు టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో వీరంపల్లిలో నాకు 300 కి పైగా ఓట్ల మెజార్టీ వచ్చింది. వీరి చేరికలతో టీడీపీ మరింత బలోపేతమవుతుందని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు మండలాల పరిధిలో టీడీపీ ఘన విజయం సాధించేలా బలోపేతం చేసుకుంటున్నాం అన్నారు. మేం అధికారంలో ఉన్న సమయంలో చీమకు సైతం అన్యాయం జరగనివ్వం, చేసైతే సాయం చేస్తాం లేదంటే సర్దిచెబుతాం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అనేక అరాచకాలు జరిగాయి. అమాయకులు ఆస్తులు కోల్పోయారు. పూల తోటలు ఎండబెట్టుకున్నారు. భూములు బీడు పెట్టుకున్నారు. రొయ్యల గుంతలు తెగొట్టడంతో కోట్ల రూపాయలు నష్టపోయిన వారు కూడా ఉన్నారు. టీడీపీ కూటమి ప్రభ్వుం వచ్చాక అన్యాయాలు, అక్రమాలకు ఫుల్ స్టాఫన పడింది. వ్యవస్థలన్నీ గాడిలో పడుతున్నాయన్నారు. వెంకటాచలం మండలం కాకుటూరులో ఎకరా రూ.2.50 కోట్ల విలువ చేసే 15 ఎకరాల భూముల రికార్డులతో గుడ్లూరు తహశీల్దార్ కార్యాలయంలో కూర్చుని మార్చేశారు. రామదాసుకండ్రిగలో 57 ఎకరాలు, మరుపూరులో 57 ఎకరాలు, సూరాయపాలెంలో 36 ఎకరాలను, కొమ్మలపూడిలో 19.20 ఎకరాలు, సర్వేపల్లిలో 6.30 ఎకరాలు, వావిలేటిపాడులో 4.20 ఎకరాలు కాజేశారు. ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉందని వైసీపీ నాయకుల భూములు లాక్కుని మా పార్టీ వాళ్లకు ఇస్తామా ఎవరైనా పొరపాట్లు చేసే ప్రయత్నం చేసినా సరికాదని మందలిస్తాం.. కానీ ప్రోత్సహించం అన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం - వీదిన పడ్డ కుటుంబం



**మనుబోలు ఆగష్టు 25 ప్రభాతవార్త :** మనుబోలు మండలం కట్టువపల్లి గ్రామం హరిజనవాడలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయింది. బాధితులు తలారి మీరమ్మ వివరాలు మేరకు తాము కూలి పనులకు వెళ్లామని, స్దానికులు సమాచారం అందించడంతో వచ్చి చూస్తే ఇల్లు నిర్మించుకునేందుకు దాచిపెట్టిన రెండు లక్షల నగదు, ఆరు సవర్ల బంగారం కాలి బూడిదయి పోయాయని లబోదిబో మన్నారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరారు. తమకు ఎలాంటి ఆస్తులు పొలం ఏమి లేవని ఉన్న ఒక్కగూడు కాలిపోయిందని వాపోయారు. స్దానికులు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన లాభం లేకుండా పోయిందని స్దానికులు తెలిపారు. కాళీ బూడిదైన ఇంటిని చూసి ప్రతి ఒక్కరు ఆయ్యో పాపం అంటు విచారం వ్యక్తం చేశారు. ఉన్న పళంగా వీధిన పడ్డ కుటుంబానికి ప్రభుత్వం అండగా నివాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి



**మనుబోలు ఆగష్టు 24 ప్రభాతవార్త :** స్మార్ట్ కార్డు ద్వారానే రేషన్ బియ్యం పంపిణి చేస్తామని ఉప తహసిల్దారు ప్రదీప్‌కుమార్ తెలిపారు. మనుబోలు మండల రెవిన్యూ కార్యలయంలో సోమవారం ప్రజాప్రతినిదుల చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు మండలానికి 12330 స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. వీటిని సచివాలయ సిబ్బంది చేత ఇంటి వద్దకే అందజేస్తామన్నారు. అందులోని క్యూఆర్ కోడు స్కాన్ చేసి రేషన్ బియ్యంను త్వరితగతిని అందజేస్తామన్నారు. ఈనెల 25 నుండి 31 వరకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ అరుణ్ తేజా ,విఆర్ఓలు నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు, టిడిపి నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, పోన్నూరు రామకృష్ణయ్య, శివుడు రాజా గౌడ్,రాయపాటి కిరణ్‌కుమార్, వర్దినేని మస్తాన్‌నాయుడు, వెందోటి బాస్కర్‌రెడ్డి, జనసేన నాయకులు పెనుబాక ప్రసాద్, మహేష్ ఖాదర్ వల్లి జాకిర్ తదితరులు పాల్గోన్నారు.

## గత ప్రభుత్వంలో తొలగించిన 70 రేషన్ కార్డులు పునరుద్ధరణ

### టిడిపి సీనియర్ నాయకులు రాగల శివకృష్ణ



**ముత్తుకూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త :** ముత్తుకూరు గత ప్రభుత్వంలో కృష్ణపట్నం పంచాయతీకి చెందిన 70 రేషన్ కార్డులను తొలగించారు. ఈ విషయాన్ని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే అధికారులు దృష్టికి తీసుకువెళ్లి 70 మందికి రేషన్ కార్డులు ఇప్పించడం జరిగిందని రాగాల శివకృష్ణ తెలిపారు. గ్రామస్తులు తరఫున ఆయనకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కృష్ణపట్నం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నెల్లూరు సెంట్రల్ జైల్లో వైఎస్ఆర్సీపీ నేతలకు భరోసా



**నెల్లూరు రూరల్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** గూడూరు వైఎస్ఆర్సీపీ నాయకులు, చిల్లకూరు మండల ఉపాధ్యక్షులు వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి అక్రమ కేసులో అరెస్టై ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిసి జైలులోని కుమారస్వామి రెడ్డిని ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా నేతలతో పలు అంశాలపై ఆయన చర్చించారు. కేసుల గురించి అధైర్య పడవద్దని, పార్టీ పూర్తిగా తన అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీలు భరోసా ఇచ్చారు. వైఎస్ఆర్సీపీపై రాజకీయ దాడులు జరుగుతున్నప్పటికీ, పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీలు పిలుపునిచ్చారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**కొడవలూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని ఆలోచనతో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని స్థానిక తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న రేషన్ షాపుల సంబంధించిన కార్డుదారులకు స్మార్ట్ కార్డులు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి తహసిల్దార్ కార్యాలయంకు చేరుకుని సమస్యలను తెలిపారు. వాటిని పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాప వెంకటేశ్వర్లు నాయుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పంది శ్రీనివాసులు, డిప్యూటీ తహసిల్దార్ సారంగపాణి, ఆర్ ఐ, మండల సర్వేయర్, పలు శాఖ అధికారులు, స్థానిక వీఆర్వో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు




**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** దేశంలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాలో 7,10,990 మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయనున్నారు. ఒక వైపు లబ్ధిదారుని ఫోటో, కార్డు వెనకవైపు కుటుంబ సభ్యుల వివరాలు, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉంటాయి. దాంతో ఎక్కడి నుండైనా రేషన్ తీసుకునే సౌకర్యం లబ్ధిదారులకు కలుగుతుంది.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**వింజమూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డులను మండల తెలుగుదేశం పార్టీ నేతలు లబ్దిదారులకు రేషన్ డీలర్ల సచివాలయ సిబ్బంది సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్ల వెంకటేశ్వర్లు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య మాట్లాడుతూ ఎంతో కాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కార్డుల రూపంలో కొత్త కార్డులను అందజేసింది అన్నారు. కార్డుల్లో మార్పులు చేర్పులు వేసుకొని కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్న లబ్దిదారులకు ఈ కార్డులో పూర్తి సమాచారంతో కార్డులను అందజేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ఫలితం లేదని కనీసం కార్డుల మార్పులు చేర్పులు కూడా జరగలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మార్పులు చేర్పులతో ఆధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్న స్మార్ట్ కార్డులతో బయోమెట్రిక్ డేటా క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఎక్కడి నుంచైనా సులభంగా రేషన్ సరుకులు తీసుకునే అవకాశం ఉందనితెలిపారు. ఏటీఎం కార్డు సైజులో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డులు ప్రభుత్వం ఇవ్వడంతో ప్రజలు కూడా సంతోషిస్తున్నారని అన్నారు. ఈనెల 31వ తేదీ వరకు డీలర్ల ద్వారా లబ్దిదారులకు రెవెన్యూ సచివాలయ సిబ్బంది ఒకటోతేదీ వరకు కార్డులను పంపిణీ చేస్తారన్నారు. ఒకటో తేదీ నుండి రేషన్ పంపిణీ మొదలవుతుందని ఈ పాస్ మిషన్ ద్వారా కార్డు ద్వారా వేలిముద్ర తీసుకొని ఆన్‌లైన్ పద్దతిలో స్మార్ట్ కార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఇంకెవరైనా మార్పులు చేర్పులు చేసుకోవాలన్న ప్రభుత్వం వచ్చే నెల నుండి అవకాశం కల్పించిందని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నేతలను స్మార్ట్ కార్డుల పంపిణీలో పాల్గొని ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్లు కోడూరు నాగిరెడ్డి, గని శ్రీనివాసులు, మండల మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, సర్పంచ్ నల్లగొండ సుజనా, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎమ్మెస్ నాయుడు, షేక్ బాదుల్లా, చేబ్రోలు వసంతరావు, ఏగినేని శ్రీనివాసులు, ఎన్.రాయుడు, గురిజాల వాసు నాయుడు, సుబ్బరాయుడు, షేక్ అబ్దుల్లా, చెరుకూరి వెంకటేశ్వర్లు, జనాపురం కృష్ణ, మారెళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## ఆర్టీసి బస్సు ఢీకొని వృద్దురాలు మృతి



**చేజర్ల ఆగష్టు 25 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని కాకివాయి రోడ్డు వద్ద నెల్లూరు కలువాయి ప్రధాన రహదారి వద్ద ఆర్టీసి బస్సు ఢీకున్న సంఘటనలో నల్లి అంకమ్మ (70) సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేజర్ల మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన గిరిజన వృద్దురాలు నల్లి అంకమ్మ కుటుంబ సభ్యులతో కలిసి కలువాయి వెళ్లేందుకు కాకి వాయి రోడ్డు వద్ద బస్సు ఎక్కే క్రమంలో పొరపాటున ఆర్టీసి బస్సుకు ముందు భాగంలో రావడంతో డ్రైవర్ బస్సును ముదుకు వెళ్ళడంతో ఆర్టీసి బస్సు చక్రాల కింద పడి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు చేజర్ల ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రసాయన ఎరువులు వద్దు - సేంద్రీయ ఎరువులు ముద్దు



**మర్రిపాడు, ఆగష్టు25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మర్రిపాడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పండించిన కూరగాయలు ఉపాదిహామీ పథకం ఎపిఒ వెంకటనారాయణ, వెలుగు ఎపిఎం బుజ్జమ్మ, ఖాదర్పూర్ ఐసిఆర్సి నవ్య, బ్రాహ్మణపల్లి వెంకట సుధా ఆధ్వర్యంలో సోమవారం తోటకూర, పాలకూర, గోంగూర, వంకాయలు, చిక్కుడుకాయలను విక్రయించారు. ఈసందర్భంగా ఉపాదిహామీ పథకం ఎపిఒ వెంకట నారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు తినడం మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రస్తుతం రసాయన ఎరువులతో పండించిన పంటలు తిని మన అనారోగ్యం పాలవుతున్నామన్నారు. కావున రసాయన ఎరువులను ఆపి సేంద్రీయ ఎరువులను వాడి కూరగాయలను పండించి వాటిని ఆహారంగా తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పెరటిలో కూరగాయాలు సాగుచేసి పండించాలన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో పండించిన పంటలను వ్యవసాయ సిబ్బంది తీసుకువస్తారని వాటిని అందరూ తీసుకోవాలని బుజ్జమ్మ కోరారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు, ఉపాదిహామీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ఆరు నెలలకే అధ్వాన్నంగా తయారైన దగదర్తి- వెలుపోడు రోడ్డు



**దగదర్తి, ఆగష్టు 25, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన దగదర్తి నుంచి వెలుపోడుకి పోయే ఆర్ఎంబి రోడ్డు వేసిన ఆరు నెలలు కూడా పూర్తి కాకుండా అధ్వాన్నంగా దెబ్బతినిపోతుంది. కారణం గ్రావెల్ టిప్పర్లు అధిక లోడు చేసుకొని ఆ రోడ్డు మార్గంగా వందల సంఖ్యలో టిప్పర్స్ తిరగటం వలన పూర్తి స్థాయిలో దెబ్బతిని పోతుంది. అంతే కాకుండా అధిక దుమ్ముతో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరి టిప్పర్స్‌కి పర్మిషన్ ఉందో లేదో ఉంటే ఎన్ని యూనిట్లు పర్మిషన్ ఉందో తెలియట్లేదు. గ్రామాల్లో ఇంటికి అవసరమైన మట్టి తోలుకోవాలన్న చిన్న ట్రాక్టర్ ద్వారా మట్టి తోలుకున్న అది నేరంగా భావిస్తూ అధికారులు ప్రవర్తిస్తుంటారు. మరి వందల సంఖ్యలో టిప్పర్లు ద్వారా తరలిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు నిద్రపోతున్నారు అని గ్రామ ప్రజలు మాటలు వినిపడుతున్నాయి. సంవత్సరాలు తరబడి రోడ్డు పాడైపోయి ఉంటే ఎవరు పట్టించుకోక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కావాలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మంచి మనసుతో దగదర్తి వెలుపోడు మబ్బుగుంటపాలెం కలుపుతూ రోడ్డు వేయించారు. ఆ రోడ్డు కాస్త ఇప్పుడు అధిక లోడ్‌తో టిప్పర్స్ తిరగటం వలన రోడ్డు మరలా దెబ్బతింటుంది. సంబంధిత అధికారులు దీనిని గమనించి వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా అంతే కాకుండా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పత్రికల ద్వారా తెలుసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## పచ్చిరొట్ట పైరు విత్తనాలు పంపిణీ



**దగదర్తి, ఆగష్టు 25, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాలతో దగదర్తి సచివాలయంలో రైతులకు పచ్చిరొట్ట పైరు జీలుగు, జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని దగదర్తి తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు వింజం కొండపనాయుడు వద్దే వెంకటేశ్వర్లు, కడియాల వెంకట సురేష్, ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు నాయుడు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండప నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవసాయానికి రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగంగా రసాయన ఎరువులను తగ్గించి నేల యొక్క సారవంతాన్ని పెంచేందుకు 50శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట పైరు విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ శాఖ అధికారి ఎం.మీరయ్య, దగదర్తి తెలుగుదేశం పార్టీ నాయకులు రావి ఆదిశేషయ్య, వింజం సురేష్‌తో పాటు పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి: ఎస్సై



**దగదర్తి, ఆగష్టు 25, ప్రభాతవార్త :** దగదర్తి మండలంలో గల గ్రామాలలో వినాయక మండపాలకు అందరూ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని దగదర్తి ఎస్సై జంపని కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో అందూ సామరస్యంగా జరుపుకోవాలని వినాయక మండపాలను ఏర్పరుచుకునే వాళ్లు పోలీసుల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని వినాయక చవితి పండుగల్లో వేసే మండపాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అంతే కాకుండా డీజేలు, బాణ సంచా, పెద్ద లౌడ్ స్పీకర్ పెట్టడం వాటికి అనుమతి లేదని, చుట్టు పక్కల ప్రజలను ఇబ్బంది పెట్టకుండా చూడాలని చెప్పారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వినాయక మండపాల కమిటీ మెంబర్స్ బాధ్యులు అవుతారని చట్టాన్ని ధిక్కరించి ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని దగదర్తి మండల ప్రజలు వినాయక చవితి పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై జంపని కుమార్ చెప్పారు.

## అవార్డు గ్రహీతకు అభినందనలు



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో వెటర్నరీ పోలి క్లినిక్‌లో వృతి రీత్యా విశిష్ట సేవలందించిన డాక్టర్ ఎం.మాలకొండయ్య, స్వాతంత్ర్య దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న వెటర్నరీ పాలీ క్లినిక్ సమావేశ మందిరంలో సోమవారం తోటి వైద్యులు సిబ్బంది ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో పోటీ పడే తత్వం ఉంటే అవార్డు అందుకోవడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. తాను తొలి నుంచి వృత్తి మీద గౌరవం, అంకితభావంతో పని చేస్తున్నానని తెలిపారు. ఏ శాఖలో నైనా కష్టపడి పని చేసే తత్వం ఉంటే, గుర్తింపు తప్పక లభిస్తుందన్నారు. పేద ప్రజలకు సహాయపడి తగిన గుర్తింపు పొందాలని ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ పోలీ క్లినిక్ వైద్యులు డీడీ, టి.సోమయ్య, డాక్టర్ జి.కృష్ణమూర్తి, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ చైతన్య కిషోర్, డాక్టర్ పి.జయప్రకాష్, వెటర్నరీ పోలీ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా ఎక్కడినుండైనా రేషన్ సరకులు

### ..టిడిపి యువనేత చెన్ను అశోక్ రెడ్డి



**రాపూరు, ఆగష్టు25ప్రభాతవార్త :** రాష్ట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతనంగా తీసుకువచ్చిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా వినియోగదారులు రాష్టంలో ఎక్కడ చౌకదుకాణంలో నుండైనా రేషన్ సరకులు పోందవచ్చని తెలుగుదేశం పార్టీ రాపూరు మండల యువనాయకుడు చెన్ను అశోక్ రెడ్డి తెలిపారు. సోమవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు ఆయన మండలంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంబించారు. ఇందులో బాగంగా రాపూరు, సిద్దవరం గ్రామాలలో రేషన్ స్మార్ట్ కార్డులను ఆయన వినియోగదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాలలో పారదర్శకత కోసం అవకతవకలకు తావు లేకుండా వుండేలా ఈ స్మార్ట్ కార్డులు రూపోందించడం జరిగిందన్నారు. మండలంలోని 47 రేషన్ షాపుల పరిధిలో 14,175 మంది వినియోగ దారులకు ఈ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, టిడిపి ఎస్‌సీ సెల్ రాష్ట నాయకుడు పచ్చిగళ్ళ రత్నం, రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ గజరా వేణుగోపాల్, పఠాన్ ఖాన్ బాషా, సికిందర్, ఆరిఫ్, షపి, సమయం ప్రసాద్, చిలకా ప్రసాద్ రెడ్డి, నల్లవడ్ల బాస్కర రెడ్డి, తాతిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మాజీ యంపీపీ ఇసళ్ళ సూర్యప్రకాష్, కూనిపోగు కన్నయ్య, మాలేపాటి వెంకటరమణా రెడ్డి, రబ్బాని, సంకల పాపయ్య, చిగిచర్ల మహేష్, రమేష్, పరంధామి రెడ్డి, జనసేన నాయకురాలు కోండాపురం కస్తూరి, ఆర్ఐ రవి తేజ, పలువరు సచివాలయం సిబ్బంది, తదితరులున్నారు.

## చేజర్ల స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణి



**చేజర్ల ఆగష్టు 25 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనలో భాగంగా ప్రజలకు సంక్షేమపథకాలు పారదర్శకంగా అందించేందుకు లక్ష్యంగా ప్రజలందరికి స్మార్ట్ రైస్ కార్డులు పంపీణి చేశారు. ఈ సందర్భంగా తహసిల్దారు కార్యాలయంలో ఆవరణంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి తహసిల్దారు బి.మురళీ ఆద్వర్యంలో ఎంపిడిఒ అమర్‌ఎంపిపి తూమాటి విజయ్‌బాస్కర్‌రెడ్డి , సొసైటీ అద్యక్షులు బూదళ్ళ వీరరాఘవరెడ్డి, ముఖ్య అతిధులుగా పాల్గోని నూతన స్మార్ట్ రైస్‌కార్డులను లబ్దిదారులకు వారి చేతులు మీదుగా అందజేయడం జరిగింది. చేజర్ల మండలంలో 10 వేల 827 స్మార్ట్ రైస్‌కార్డులు మంజూరు అయ్యాయని,15 గ్రామ సచివాలయాలలో గ్రామ రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి రైసు కార్డులు పంపీణి చేస్తున్నట్లు తెలిపారు. లబ్దిదారులు ఇంట్లో లేనటువంటి వారికి రేషన్ డీలర్ల వద్ద స్మార్ట్ రేషన్‌కార్డులు తీసుకోవచ్చునని తెలియజేశారు. ఈకార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గోన్నారు

## పలువురు ను పరామర్శించిన కావలి ఎమ్మెల్యే



**బిట్రగుంట ఆగష్టు 25 ప్రభాతవార్త:** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గారు సోమవారం పలు, కుటుంబాలను పరామర్శించారు బోగోలు మండలం చెంచులక్ష్మిపురం కు చెందిన బుద్ధయ్య సతీమణి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బోగోలు మండలం కొత్తూరు కు చెందిన గురజాల రమేష్ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన నాటకరాని సీనయ్య ఆరోగ్యం సరిగా లేక ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి చేరుకొని శీనయ్యను పరామర్శించారు. జాగ్రత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని కోరారు. కోవూరుపల్లికి చెందిన నాటకరాని భాస్కర్ మరియు తిరుపతి తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం కోవూరుపల్లిలోని వారి నివాసానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, కండ్లగుంట మధుబాబు నాయుడు, కోడూరు వెంకటేశ్వర రెడ్డి, ఆది శేషయ్య, మహాజన సైన్యం సురేంద్ర, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## వినాయకవిగ్రహ ఏర్పాటులో కూడ రాజకీయ జోక్యం దారుణం

### సిఐ ముందు గోడువెళ్ళబుచ్చుకున్న తిమ్మసముద్రం సర్పంచ్



**జలదంకి, ఆగష్టు25, ప్రభాతవార్త:** గ్రామంలో ఎన్నడు వినాయకవిగ్రహ ఏర్పాటులో విభేదాలు వుండేవి కావు, అంద రం కలసికట్టుగ ఏకత్రాటిమీద పోయేవారం ,పండుగను భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించుకునే సాంప్రదాయం మాది అయితే ఈఏడాది మితిమీరిన రాజకీయజోక్యంతో మనస్ప ర్ధలు ఏర్పడి పోలీసులజోక్యం వంటివి చోటు చేసుకోవడం దారుణం ఇది ఏమాత్రం మంచిపద్దతి కాదని జలదంకి మండలం తిమ్మసముద్రం సర్పంచ్ రావి ప్రసాద్‌తనగోడును కలిగిరి సిఐ నారాయణముందు వెళ్ళబుచ్చుకున్నారు. వినాయకచవిత పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో గణనాదునివిగ్రహ ఏర్పాటులో అధికార టిడిపి,వైసిపివారి మద్య విభేదాలు పొడచూపాయి. సాంప్రదాయ ప్రకారం గ్రామ దేవాలయ ప్రాంగణంలో విగ్రహ ఏర్పాటు చేద్దామని ఒకవర్గం అంటుంటే కాదు ముందుగ తాము విగ్రహ ప్రయత్నాలు చేశాముకాబట్టి మేమే అక్కడ పెట్టాలని మరోవర్గం పట్టు దీంతో పంచాయతి పోలీస్‌స్టే షన్‌కు చేరింది. గతరెండు మూడు రోజులనుంచి ఎస్ఐ లతీవున్నీష ఇరువర్గాలకు నచ్చచెప్పె ప్రయత్న ంచేసింది. కాని ఇరువర్గాలు ససేమిర అనడంతో కలిగిరి సిఐ రంగంలోకి దిగారు. సోమవారం ఎస్ఐ లతీవు న్నీష. సిబ్బందితో తిమ్మసముద్రంకు వెళ్ళారు. గ్రామ కమ్యునిటి హాలువద్దకు ఇరువర్గాల పెద్దలు నేతలను పిలిపించారు. టిడిపికి చెందిన తల్లపనేని మధు, కంచర్ల వినోద్ తదితరులు, వైసిపికి చెందిన సర్పంచ్ రావి ప్రసాద్ ఇతర పెద్దలతో సమావేశమయ్యారు. ఆద్యాత్మిక కార్యక్రమంలో విషయంలో భేషజాలు వుండకూడదు సర్దుకుపోండని చెప్పారు. పోని వేరువేరు ప్రాంతాలలో పెట్టుకోండి సమస్యే వుండదని వివరిం చారు. వేరేప్లేసులో అంటే సెంటిమెంటు అడ్డొస్తుంది కావున కుదరదని పెద్దలు పెదవివిరిచారు. ఇలా కౌన్సి లింగ్ కొనసాగుతున్న తరుణంలో కొందరు మహిళలు హాలువద్దకు విచ్చేసి మేము మావాదన చెప్పాల ంటు సిఐ ముందుకొచ్చారు. వారు ఏప్రతిపాదన చేశారోకాని ఒక్కసారిగ సర్పంచ్ రావి ప్రసాద్ ఆయన వర్గం వారు బయటకు వచ్చారు. మేము ఎంత సహకరిస్తున్న వినడంలేదు ఇపుడు ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌తో ఫోన్‌లో సంప్రదించాం మావిగ్రహం ఖచ్చితంగ పెట్టాలని వారంటున్నారు. ఇదెక్కడి న్యాయమంటు కాస్త గట్టిగ మాట్లాడారు. ఆదేసమయంలో కొందరు మహిళలు అసలు మాగ్రామ దేవాలయం విషయంలో ఎంఎల్ ఎకు ఏం సంబందం. ఆయన జోక్యమేంటి మేమొప్పుకోమని నలుగురు నాలుగు రకాలుగ మాట్లాడ సాగారు. పరిస్థితి మారుతున్న వైనాన్ని గమనించిన సిఐ వారిని సర్దుబాటుచేయడంలో తంటాలు పడాల్సి వచ్చిం ది. అంతేకాదు గ్రామ పెదకాపు మాటను పెడచెవినపెడతారు, సర్పంచ్ సూచనలను లెక్కచేయరు ఆలెక్కన ఇక సర్పంచ్ ఎందుకు, పెదకాపెందుకని వైసిపివారు ప్రశ్నించారు. ఎటొచ్చి మీరుకూడ అదికారపక్ష వితండ వాదంవైపే మొగ్గుచూపుతున్నట్లే మాకు బోదపడుతుందని సర్పంచ్ నిష్ఠూరమా డారు. ఇందులో యువకుల ఉత్సా హం వుంది అర్దంచేసుకోండి కాదంటార మీఇష్టంవచ్చినట్లు చేసుకోండిమేము చేసేదేమిలేదు అంటువెళ్ళిపోయారు. అబ్బే అదేంలేదండి అందరు కలసికట్టుగ ఐక్యంగ కార్యాన్ని వెళ్ళదో యండి,కూర్చొని సామర స్యంగ మాట్లాడుకోండి అవసరమైతే మరోమారు వస్తాము సహకరించండని సిఐ అన్నాడు.

## తొలగించిన దివ్యాంగులు పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి



**కావాలి, ఆగస్టు25, ప్రభాతవార్త:** తొలగించిన దివ్యాంగులు పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సోమవారం కావలి ఆర్డిఓ వంశీకృష్ణకు బిసి ఐక్యత భవన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా అద్దంకి ప్రభాకర్ మాట్లాడుతూ దివ్యాంగుల యొక్క పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించడం జరిగినదన్నారు వాస్తవంగా 2008 సంవత్సరం నుంచి అందులకు ఒక కన్ను పోయినా కూడా 40 శాతం ధ్రువీకరణ పత్రమును అనగా సదరం సర్టిఫికెట్ 2010లో ఇచ్చి ఉన్నారు. అందులో అప్పటి నిబంధనల ప్రకారం,ఒక కన్ను పోయినవారికి 40శాతం సదరం సర్టిఫికెట్ ఇచ్చినారన్నారు, మానసిక వికలాంగులకు కొంతమంది చూడటానికి బాగున్న వారి ప్రవర్తన బాగా లేక మానసికంగా ఏమి మాట్లాడతారు ఏమి అంటారు ఒకసారి మూర్ఛ పోతారు ఇలా అనేక సమస్యలతో బాధపడే వారికి సదరం ధ్రువీకరణ పత్రము మంజూరు చేసినారన్నారు, శారీరక వికలాంగులకు కొంతమందికి 85 శాతం వచ్చి ఉన్నది అనగా లేక ఒక కాలు పూర్తిగా తీసివేసిన ఒక చేయి తీసివేసిన లేకపోతే రెండు చేతులు తీసివేసిన లాంటి వారికి 80 శాతం ధ్రవీకరణ పత్రము ఉన్నది కానీ రీ వెరిఫికేషన్ లో 60 శాతం గాను 70 శాతం గాను వేసినారు ఇది అన్యాయము. దానిని సరిచేసుకోవాలని, చెవుడు మూగవారు కొంతమందికి మాటలు రావు వినపడుతది కొంతమందికి వినపడదు మాట్లాడుతారు ఇలాంటి వారికి 40 నుంచి 60 శాతం వారికి ధ్రువీకరణ పత్రము ఉన్నది నిజంగా వాళ్ళు వికలాంగులే కానీ వారికి అన్‌ఫిట్ అని వచ్చినదనీ ఇది అన్యాయమన్నరు దీనిపై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి రద్దయిన పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవింద్, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, కార్యదర్శి దాసరి వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు

## కొనదిన్నె గిరిజన కాలనీ అభివృద్ధిలో అండగా ఉంటా



**కావలి, ఆగస్టు25, ప్రభాతవార్త:** కావలి మున్సిపాలిటీ పరిధిలోని కొనదిన్నె గిరిజన కాలనీ అభివృద్ధిలో అన్ని విధాలుగా అండగా ఉంటానని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలియజేశారు కావలి పట్టణం 6వ వార్డులోని కొనదిన్నె గిరిజన కాలనీలో అధికారులతో కలిసి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా నూతన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ చేశారు. అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడారు ఎన్నికల్లో మొదటి సారిగా కొనదీన్నే గిరిజన కాలనికి వచ్చానన్నారు స్మార్ట్ రేషన్ కార్డులు కూడా ఇక్కడే అందజేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం,చెప్పింది చెప్పినట్టుగా హామీలు అమలు చేస్తోందన్నారు అన్నిటికీ రేషన్ కార్డు ముడిపడి ఉందని అందరూ తప్పనిసరిగా రేషన్ కార్డులు తీసుకోవాలన్నారు వైసీపీ ప్రభుత్వం రాష్టాన్ని విధ్వంసం చేసిందన్నారు టీడీపీ ని గెలిపించి ప్రజలు మంచి పని చేసారన్నారు మహిళలు గౌరవించే ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వం అన్నారు,ప్రభుత్వ పథకాలు మహిళలకు అందిస్తు ందన్నారు రాష్టంలో ఎన్నో ఇబ్బందులు ఉన్న కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అందజేస్తుం దన్నారు త్వరలో కాలనీలు మంజూరు అవుతాయన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకా రంతో కావలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో కావలి ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు,ప్రధాన కార్యదర్శి జ్యోతిబా పూరం, కార్యదర్శి మొగిలి కల్లయ్య, సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఏగురి చంద్రశేఖర్ మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌కు ఏఇలు డుమ్మా



**చేజర్ల ఆగష్టు 25 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతి సోమవారం అన్ని మండల రెవిన్యూ డివిజన్ జిల్లా కేంద్రాలలో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధికారుల నుండి స్పందన కొరవడుతోంది. ప్రత్యేకించి మండలకేంద్రమైన చేజర్లలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి ప్రత్యేకించి ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధికారులు డుమ్మా కొడుతున్నారు. తహసిల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల వేదికకు హౌసింగ్,పంచాయితీరాజ్,ఆర్అండ్‌బి ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, నీటి పారుదల శాఖ ( ఒక విభాగం ) తదితర మండల శాఖల ఇంజనీరింగ్ అధికారులు గైరు హాజరు అయ్యారు. సోమశిల ప్రాజెక్టులకు సంబందించిన ఇంజనీరింగ్ అధికారి కూడా గైరు హాజరు అయ్యారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల నుండి వివిధ సమస్యలపై వినతులు సమర్పించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడం పరిపాటి అధికారుల ఆ సమస్యలను అక్కడిక్కడే పరిష్కారం చూపడం కూడా సాధరణంగా జరిగే అంశం . గ్రామీణ సమస్యల పరిష్కరించడంలో ప్రముఖ పాత్ర పోషించాల్సిన అధికారులు డుమ్మా కొట్టడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి క్రమం తప్పకుండా అన్ని శాఖల అధికారులు, ఈ ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి హాజరైయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ అంశంపై స్దానిక తహసిల్దారు బి మురళీని వివరణ కోరగా వారు ఇలా బదులు ఇచ్చారు. ఇంజనీరింగ్ అధికారులు గైరు హాజరైన విషయం వాస్తవమేనని అన్నారు. ఇలాగే మరోక సారి చేస్తే వారి పై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## వెలుగు కార్యాలయంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు



**బుచ్చి ఆగష్టు 25 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం వెలుగు కార్యాలయంలో ఎపిఎం శ్రీదర్ నేతృత్వంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడు బొమ్మను తీసుకొని వచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పొదుపు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని అత్యంత భక్తి శ్రద్ధల తో పూజించారు. పూజా కార్యక్రమాల అనంతరం అందరికి ప్రసాదాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎపిఎం శ్రీదర్ మాట్లాడుతు ప్రతి ఒక్కరికి ఘణనాధుని ఆశీస్సులు ఉండాలని కాంక్షించారు.

## మందిపాటి శ్రీహరిరెడ్డిని సన్మానించిన సచివాలయ సిబ్బంది



**సంగం ఆగష్టు 25 ప్రభాతవార్త :** సంగం మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా సోమవారం మందిపాటి శ్రీహరిరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. సచివాయం సెక్రటరీ రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది ఆయనను పూలమాలలతో సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యేని సన్మానించిన రాజశేఖర్




**సీతారామపురం ఆగష్టు 25 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ను సీతారామపురం మండల సొసైటీ అధ్యక్షులు సోమన బోయిన రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి బొక్కేను అందించారు. సీతారామపురంలోని మారంరెడ్డిపల్లి పిఎసిఎస్ చైర్మన్‌గా సోమన బోయిన రాజశేఖర్ ఇటీవల ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన తొలిసారి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సీతారామపురంలోని రైతుల సమస్యలను పరిష్కరించి ప్రతి రైతును ఆదుకునేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సొసైటీ అధ్యక్షులు రాజాకు సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతు తనపై ఎంతో నమ్మకంతో సొసైటీ అధ్యక్షులుగా నియమించినందుకు ఎమ్మెల్యేకి ఎల్లవేళలా రుణపడి ఉంటానని సీతారామపురం మండలంలో టిడిపి పార్టీని ఎమ్మెల్యే కాకర్త సురేష్ నాయకత్వానా మరింత బలోపేతం చేసేందుకు అహర్ని హలు శ్రమిస్తానని అన్నారు. అదే విధంగా సీతారామపురంలోని రైతాంగాన్ని అన్ని విధాలా అదుకునేందుకు ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మాజీ జడ్‌పిటిసి కలివెల జ్యోతి, మాజీ కన్వీనర్ ముత్తం శెట్టి చెన్నకేశవులు, టిడిపి సీనియర్‌నాయకులు గాజులపల్లి చంద్రారెడ్డి, వంగలశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు బోగినేని కాశీరత్తయ్య, మండల యువనాయకుడు పసుపులేటి వికాస్ బాబు, ఎడమ ప్రవీణ్, పిడుగు రమేష్, దేవర వెంకటేశ్వర్లు, కరుణాకర్‌రెడ్డి, ఆదెయ్య, పిన్నిబోయిన రమణయ్య, తురకా వెంకటేశ్వర్లు, షేక్ బాబు, ఆలూరు శ్రీనివాసులు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డులు పంపిణి



**వరికుంటపాడు ఆగష్టు 25 ప్రభాతవార్త :** నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన స్మార్ట్ రైసు కార్డులను తహసిల్దారు పసుపులేటి హేమంత్ కుమార్ ఆద్వర్యంలో టిడిపి మండల కన్వీనర్ చంద్ర మదుసూదన్‌రావు లబ్దిదారులకు పంపిణి చేశారు. సోమవారం స్దానిక వరికుంటపాడు ఎస్‌సి కాలనీ నందు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు మాట్లాడుతు వరికుంటపాడు మండలంలోని 24 గ్రామ పంచాయితీ పరిధిలో 9 వేల 47 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని వీటిని సచివాలయ రికార్డుల ద్వారా లబ్దిదారులకు అందజేస్తున్నామని అన్నారు. దేశంలో ఎక్కడాల లేని విధంగా ముఖ్యమంత్ర చంద్రబాబునాయుడు తొలిసారిగా స్మార్ట్ రేషన్‌కార్డును ప్రవేశ పెట్టడం శుభపరిణామమని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ గోపి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి, గ్రామ పార్టీ అధ్యక్షులు పొద మాదవ్‌రావు, జడ్‌పిటిసి సభ్యులు రావెళ్ళ నాగేంద్ర, నాయకులు పోకా మహేష్, మాలకొండరాయుడు, కామేపల్లి వెంకటరత్నం, బాల గురవారెడ్డి, దేవనబోయిన మధు, శివరామరెడ్డి, బొజ్జయ్య, పరందాముల రెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చిలో అట్టహాసంగా స్మార్ట్ రైస్ కార్డులు పంపిణి



**బుచ్చి ఆగష్టు 25 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రైస్ కార్డు డిస్ట్రిబ్యూషన్‌ని బుచ్చిరెడ్డిపాళెం మండల ంలోని తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు ప్రారం భించారు. మండలం మొత్తం 37 రేషన్‌షాపులు ఉన్నట్లు ఆయన తెలిపారు. 23,437 స్మార్ట్ రైసులు కార్డులు పంపిణి చేయడం జరిగిందని చెప్పారు. 25 వ తేది నుండి 5 రోజులు గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ తర్వాత ఏమైనా కార్డులు మిగిలితే రేషన్‌షాపు డీలర్స్ ద్వారా పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. కాశీపాళెంలోని రేషన్‌షాపు 2 నందు ఈకార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈకార్యక్రమంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, సిఎస్‌డిటి మల్లికార్జున, ఆర్ శాంతిప్రియ, విఆర్‌ఒలు, తెలుగుదేశం పార్టీ అర్బన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, 17 వ వార్డు కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## సదరంకు వచ్చే వారు నిర్ణీత పత్రాలతో రావాలి



**కోవూరు, ఆగష్టు25 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి సోమవారం సదరం స్లాట్ బుక్ చేసుకుని పరీక్ష నిమిత్తం వచ్చే రోగులు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న దృవీకరణ పత్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని డాక్టర్ ఎన్. అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరం స్లాట్ బుక్ చేసుకున్న వికలాంగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారి దగ్గర ఉన్న దృవీకరణ పత్రాలను ఆధార్‌తో కలిపి జెరాక్స్ తీసుకుని రావాలన్నారు.

## దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు అన్యాయం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు అన్యాయం అంటూ దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వ కర్కశత్వం నశించాలంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివ్యాంగులు.. నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దివ్యాంగులు కలెక్టరేట్ ఆవరణలో దివ్యాంగుల పట్ల ప్రభుత్వ వైఖరి. సరికాదంటూ నినాదాలు చేశారు. అనంతరం వైఎస్ఆర్సీపి దివ్యాంగుల విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల నాగేంద్ర, జిల్లా అధ్యక్షులు చల్లా మోహన్ షైక్ సుభాన్ భాష, దివ్యాంగులతో కలిసి కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం తొలగించిన దివ్యాంగుల పెన్షన్లను.. తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని కోరారు.

## వెంగారెడ్డిపాళెంలోని స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి



**సంగం ఆగష్టు 25 ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి సూచనలతో వెంగారెడ్డిపాళెం గ్రామంలో ప్రభుత్వం నూతనంగా జారి చేసిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. లబ్దిదారుల ఇం టికి తిరిగి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో విఆర్ఒ శోభనబాబు, పంచాయితీ కార్యదర్శి ఉదయ్, వెంగారెడ్డి తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, తెలుగుదేశం పార్టీనాయకులు పాల్గొన్నారు. సిద్దీపురం గ్రామంలో నీటి సంఘం అద్యక్షులు సూరా శ్రీనివాసులు, పంచాయితీ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి విఆర్ఒ తదితరులు స్మార్ట్ కార్డులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## డాబాపై చర్యలు తీసుకోండి దగదర్తి గ్రామ ప్రజలు కలెక్టర్‌కి వినతి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలోని కొత్త హరిజనవాడకు పోవు దారిలో బీమాస్ డాబా నిర్వహిస్తూ ఉన్నటువంటి యజమాన్యం. అక్రమ మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తూ దారిన వస్తు పోతున్న ఆడవారిపై మరియు బహిర్భూమికి వెళ్లిన ఆడవారిని మద్యంతాగిన వారు, అసభ్య పదజాలాలతో అవమానపరుస్తూ ఆడవారమని చూడకుండా కులం పేరుతో దూషి ఇస్తున్నారని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేసారు. డాబా యజమానులు వద్దే వినయ్ మరియు వారి మిత్రుడు కడియాల సురేష్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం ,చేయాలని దగదర్తి మండలం, దగదర్తి గ్రామ కొత్త హరిజనవాడ చెందిన ప్రజలు, కార్యాలయంలో సోమవారం కలెక్టర్‌కు విన్నపించుకున్నారు.

## అక్రమ కట్టడాలు ఆపండి గుడవళ్ళూరు గ్రామ సర్పంచ్ కలెక్టర్‌కు వినతి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** కొండాపురం మండలం గుడవళ్ళూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ బద్ధిపుడీ మాచర్ల సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్య పరిష్కార వేదికలో తమ గ్రామంలో జరుగుతున్న అక్రమ కట్టడాలకు నిలుపువేయాలని గుడవళ్ళూరు గ్రామ సర్పంచ్ మాచర్ల, కలెక్టర్‌కు విన్నపించుకున్నారు. తమ గ్రామానికి చెందిన శ్రీనివాసులు చెంచురామయ్య పంచాయితీకి చెందిన స్థలంలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తు న్నారని ఆ స్థలంలో గ్రామ ప్రజలుకు తాగునీటి కొరత లేకుండా తాగునీటి బోరు వేసి ఉన్నారని ఏమైనా ఇబ్బంది వస్తే మరమ్మత్తుల కోసం వెళ్లడానికి దారి కూడా లేకుండా అక్రమ కట్టడాలు చేస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు 473/1, సర్వేనెంబర్ గల భూమి నాగసూరి సాంబయ్య కుమారుడు కోటయ్య కు జిల్లా పంచాయతీ బోర్డు రిజిస్టర్ చేసి ఉన్నారని ఈ సందర్భంగా కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడవళ్ళూరు గ్రామ సర్పంచ్ మాచర్ల, ఉప సర్పంచ్ వేముల పాటి మని కుమార్ పాల్గొన్నారు.

## రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో



**నెల్లూరు రూరల్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** నెల్లూరు నగర 4వ డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్‌లో డివిజన్ స్థాయి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని డివిజన్ ఇన్‌చార్జ్ సందాని, కోఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో శీళి కోడ్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి, నేడు వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతూ, వాటిపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ "రెడ్ బుక్ పాలన" సాగిస్తోందని, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులపై అక్రమ అరెస్టులకు పాల్పడుతూ దుర్మార్గపు పాలన కొనసాగిస్తోందని అన్నారు. పోలీసులు కూటమి ప్రభుత్వానికి తొత్తులుగా మారి, వారి ఆదేశాల ప్రకారం కేసులు బనాయించడం వల్ల లా అండ్ ఆర్డర్ పహస్యం అవుతోందని మండిపడ్డారు. ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తూ, కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపం చెందుతూ, మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలని ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని స్పష్టం చేశారు.

## ఆనంకి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు



**నెల్లూరు రూరల్, ఆగష్టు 25, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి కి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చింతా రెడ్డిపాలెంలో ఉన్న విజయకుమార్ రెడ్డి నివా సానికి ఎమ్మెల్సీ పర్వత చంద్రశేఖర్ రెడ్డి సిటీ నేతలతో కలిసి వెళ్లి, ఆయనను ఆత్మీయంగా కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆనం విజయకుమార్ రెడ్డి ఆరోగ్యంగా, ఆనందంగా మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అని పేర్కొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను వాడండి పర్యావరణను పరిరక్షించండి



**కావలి, ఆగష్టు25, ప్రభాతవార్త:** వినాయక చవితి పర్వదినాన్ని పర్యావరణహితంగా జరుపుకోవాలని కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు తెలిపారు. జనవిజ్ఞానవేదిక కార్యాలయం లో సోమవారం ఆయన మాట్లాడారు ప్రతి ఏడాది గణపతి నవరాత్రులను అత్యంత వైభవంగా జరుపుకునే ప్రజలు వీధి వీధిన కూడళ్ళలో అతి భారీ వినాయక విగ్రహాలను పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర హానికర రసాయనాలు కలిపిన విగ్రహాలను పోటాపోటీగా ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ వేడుకలను ఐదు నుండి తొమ్మిది రోజులు వరకు కమిటీలుగా ఏర్పడి కోలాహలంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ విగ్రహాలు హాని కలిగించే వివిధ రసాయనాలతో తయారు చేయడం వలన, మనం పీల్చే ప్రాణవాయువు ఆక్సిజన్ ను కలుషితం చేసే ప్రమాదం ఉందని తెలియజేశారు. విగ్రహాలు తాకినప్పుడు, నిమజ్జనం చేసేటప్పుడు నదులు బావులు, చెరువులు, చివరకు సముద్రం విషతుల్యం అవుతుందని తెలిపారు. భక్తి కన్న ప్రాణం మిన్న, కావున ప్రాణం మీదకు తెచ్చుకునే పద్ధతులను మానివేయాలని, పర్యావరణను పరిరక్షించే విధంగా మట్టి వినాయక ప్రతిమలను వాడవల్సిందిగా తెలియజేసినారు. అదే విధంగా పూజా సామాగ్రికి ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను వాడవద్దని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి ప్రసాదాలను వెయ్యవద్దని తెలిపారు. ఈ వేడుకల్లో టపాకాయలు, ఔట్లను ఇష్టారాజ్యంగా వాడి శబ్ద కాలుష్యాన్ని కలిగించవద్దని అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమాలలో సినీ రికార్డింగ్ డాన్స్ లు, అశ్లీల డాన్సులు లేకుండా ఉత్సవ కమిటీలు చూడాలన్నారు.

## పార్టీ జిల్లా అధ్యక్ష పదవి రేసులో చెంచల బాబు యాదవ్



ఉదయగిరి , ఆగష్టు 25, ప్రభాతవార్త నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట విభగం అధ్యక్ష పదవి రేసులో మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచల బాబు యాదవ్ రేసులో ఉన్నారు. ఈ మేరకు ఆయన అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసినట్లు కూడా సమాచారం. ఉదయగిరి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని బీసీల అందరికి నాయకుడిగా ఉంటూ అందరితో సన్నిహిత సంబంధాలు కలిగిన వివాద రహితుడుగా పేరు తెచ్చుకుని నిరంతరం పార్టీ ప్రతిష్టకు పరిశ్రమిస్తూ అధినాయకుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ముందుకు సాగుతున్న పొన్నెబోయిన చెంచల బాబు యాదవ్ జిల్లా అధ్యక్ష పదవిని ఆశించడం సమంజసమేనని జిల్లాలోని బీసీ నాయకులతో పాటు నియోజకవర్గ ప్రజలు కూడా అభిప్రాయపడుతున్నారు. గతం నుంచి కూడా ప్రస్తుతానికి జిల్లాలో ఉన్న బీసీలకు ప్రభుత్వ నామినేటెడ్ పదవి కానీ పార్టీ పదవి కాని ఏదీ దక్కలేదని ఈ విషయం తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఒక సారి మననం చేసుకోవాలని ఈ ప్రాంత బీసీ నాయకులు సూచిస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి అభ్యర్థి ఎవరు అని పార్టీ అధిష్టానమే సందిగ్దంలో ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో చేస్తూ కార్యకర్తలను చదరనివ్వకుండా ఒక తాటిపై నడిపించి తెలుగుదేశం కడేర్ను మరింత బలోపేతం చేసినఘనత చెంచల బాబు యాదవ్‌కు ఉందని ఈ సందర్భంగా పలువురు నాయకులు గుర్తు చేశారు. తన తండ్రి మాజీ శాసనసభ్యులు చెంచు రామయ్య రాజకీయ వారసత్వాన్ని కొనసాగించుకుంటూ బడుగు, బలహీన వర్గాలతో మమేకమై నిరంతరం పార్టీ ప్రయోజనాలే పరమావధిగా భావిస్తూ పార్టీ అభివృద్ధితో పాటు బీసీల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ముందుకు సాగుతున్నటువంటి వ్యక్తిత్వం కలిగిన చెంచల బాబు యాదవ్‌కు నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ విభాగం అధ్యక్ష పదవి ఇవ్వడం సమంజసం అని పలువురు సూచిస్తున్నారు.

## ఆకట్టుకున్న నృత్యాలు , డప్పుల మోతలు





**కోవూరు , ఆగష్టు 25 ప్రభాతవార్త :** కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం స్త్రీ శక్తి పథకం విజయవంతం సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ ప్రాంగణంలో కిక్కిరిసిన మహిళా మణులతో ఈ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య రూపకాలు, డప్పుల మోతలు, చిన్నారుల లయ విన్యాసాలు, పాఠశాల విద్యార్థుల దేశ భక్తి గీతాలు సభను అలరిం పజేశాయి. ఈ విజయోత్సవ సభలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన మహిళామణులు పెద్ద ఎత్తున వేలాదిగా తరలిరావడంతో పార్టీ నాయకుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

## క్షయ వ్యాధి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర ఉండాలి



**కోవూరు , ఆగష్టు 25 ప్రభాతవార్త :** క్షయ వ్యాధి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర తప్పనిసరిగా ఉండాలని మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. దొరసానమ్మ తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీ నగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రధాన మంత్రి టీబీ ముక్తి అభియాన్‌లో భాగంగా ఈ అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని దీనికి సంబంధించి మందులు కూడా ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి వారి వారి ప్రాంతాల్లో ఈ వ్యాధికి సంబంధించి అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామ్‌ప్రసాద్, జంతు శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె. లావణ్య, రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ శోభారాణిలు పలు సూచనలు చేశారు.

## ఎంపీడీవో చొరవ ఇతరులకు స్ఫూర్తిదాయకం



**కోవూరు , ఆగష్టు 25 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో అంకితభావం చూపుతూ పంచాయతీరాజ్ విభాగంలో మండలాన్ని ఎప్పుడూ ప్రథమ స్థానంలో నిలుపుతున్న ఎంపీడీవో శ్రీహరిరెడ్డి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆగస్టు 15వ తేదిన అవార్డు స్వీకరించిన కోవూరు ఎంపీడీవో శ్రీహరిరెడ్డికి సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులను కలుపుకుని కోవూరు మండలాన్ని అన్ని విభాగాల్లో ముందంజలో ఉండేలా శ్రీహరిరెడ్డి తీసుకున్న చొరవ ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇటువంటి అవార్డులు పనిచేసే వ్యక్తికి మంచి ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ పై అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తూ కిందిస్థాయి ఉద్యోగులను సమన్వయం చేసుకుని కోవూరు మండలాన్ని ముందంజలో ఉండేందుకు శ్రీహరిరెడ్డి చొరవ అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీత శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయ అధికార సిబ్బంది సహకారంతో మండలాన్ని అన్ని విభాగాలుగా ముందుకు తీసుకెళ్తున్నామని, ఇందులో తన కృషి ఏమీ లేదన్నారు. వారందరూ సమిష్టిగా పనిచేయబట్టే ఈ అవార్డు తనకు దక్కిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు అశోక్‌కుమార్, మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్‌రావు, శ్రీనివాసరావు, సలీమ్, తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను భారీస్థాయిలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## స్మార్ట్ కార్డులు ఎంతో ఉపయోగకరం



**కోవూరు , ఆగష్టు 25 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రేషన్ దుకా ణానికి సంబంధించి సమూల మార్పులు తీసుకొచ్చే లక్ష్యంగా పెట్టుకుని స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టడం జరిగిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధి లోని పెళ్లకూరు కాలనీ సచివాలయంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ప్రజలకు సమర్ధవంతమైన రేషన్ సేవలు అందించేలా సాంకేతికతను వినియోగించుకునేలా ఈ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రేషన్ దుకాణాల్లో లావాదేవీలను మరింత సులభతరం చేసేందుకు ఈ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టడం జరిగిందని, రానున్న రోజుల్లో స్మార్ట్ ఈ పాస్ యంత్రాలను కూడా ప్రవేశపెట్టేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇటువంటి ఆధునిక సాధనాల ద్వారా పారదర్శకతను పెంచి అవకతవకలు తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తా యన్నారు. ఫలితంగా రేషన్ సరుకుల పంపిణీ మరింత వేగవంతం అయ్యేందుకు అవకాశం ఉంటుం దన్నారు. ప్రభుత్వం ఈ స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ వ్యవస్థల్లో సమూలమైన మార్పులు తీసుకురావాలనే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. అనంతరం స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, సర్పంచ్ విజయ, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఇంతా మల్లారెడ్డి, అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు, సాయిరెడ్డి, మదన్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు , ఆగష్టు 25 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలు అంగనరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. సోమవారం ప్రాత: కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం రాఘవాచార్యులు, శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో రుద్రాభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా, కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు. బుధవారం ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దివంగత దవనం కొండయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్త దండి సురేష్, తదితరులు ఉన్నారు.

## శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**సంగం ఆగష్టు 25 ప్రభాతవార్త** సంగం మండలం మర్రిపాడు గ్రామం లో ని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం నూతన కమీటి ప్రమాణ స్వీకారం సోమవారం ఆలయ ఇఒ రఘురాం నేతృత్వంలో అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ కమీటి చైర్మన్‌గా మందిపాటి శ్రీహరిరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అలాగే కమీటి సభ్యులుగా వల్లపు సారది ,గో గుల గంగాధర్, కొమ్మి హరిష్,కాసులనాటి లక్ష్మీనారాయణ, రామాచార్యులు ,కరకం బాక భవానీ, ఇండ్లూరి సుబ్బమ్మ, లీలమ్మ, తిరుమలశెట్టి శ్రీదేవమ్మ, ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరెడ్డి మాట్లాడుతు శ్రీచెన్నకేశవస్వామి ట్రస్టు బోర్డు చైర్మన్‌గా నియమించిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ కమీటి ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కమీటి చైర్మన్‌ని, కమీటి సభ్యులను అభిమానులు,బంధువులు ఘనంగా సన్మానించారు.

## స్మార్ట్‌కార్డులు పంపిణీ చేసిన సంగం తహసిల్దారు



**సంగం ఆగష్టు 25 ప్రభాతవార్త** సంగం కొత్తూరు సెంటర్‌లోని రేషన్ షాప్ నెంబర్ 3 పరిధిలో ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన రేషన్ కార్డులను తహసిల్దారు సోమ్లానాయక్,ఎంపిడిఒ షాలెట్, కూటమి నాయకులు లబ్దిదారులు ఇంటింటికి తిరిగి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, గునుపూడి గిరి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాగం గిరిబాబు, సంగం సాగునీటి సంఘం అద్యక్షులు షేక్ బాబు,జనసేన నాయకులు,టిడిపి టౌన్ అద్యక్షులు నాగరాజు, షేక్ ముత్తహార్ తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నేత గనుకుల కిషోర్ విజయలక్ష్మీ దంపతులు



**నెల్లూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు ఏఎంసీ డైరక్టర్ గు నుకుల విజయలక్ష్మీ, వారి భర్త జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ దంపతులు నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిని సోమవారం మర్నాథపురంలోని వీబీఆర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, వారి సతీమణి రమాదేవి దంపతుల ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం గెలుపు కోసం గనుకుల కిషోర్ విజయలక్ష్మీ దంపతులు ఎంతో కృషి చేశారు వారి కష్టా నికి ఫలితంగా గునుకుల విజయలక్ష్మీకి నెల్లూరు ఏఎంసీ డైరక్టర్‌గా జీవో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తెలుగుదేశం సిటీలో కీలకంగా వ్యవహరిస్తున్న వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిని వారి కార్యాల యంలో కలిసి వ్యవసాయ కమిటీలో తనకి పదవి వచ్చేందుకు సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు.

## తాడేపల్లిలో జగన్‌తో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి భేటీ



**నెల్లూరు రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి నివాసంలో సోమవారం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, రీజినల్ కోర్డినేటర్ కారుమూరి నాగే శ్వరరావు కూడా ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఈ భేటీలో పలు రాజకీయ అంశాలు, పార్టీ బలపరిచే చర్యలపై చర్చ జరిగింది. ప్రజల నుంచి లభిస్తున్న అపారమైన ఆదరణతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే జిల్లాలో దృఢంగా ఉన్నదని, రాబోయే కాలంలో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తూ మ రింత బలోపేతం చేస్తామని నేతలు జగన్ మోహన్ రెడ్డికి తెలిపారు. అదే విధంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే విధంగా కృషి చేస్తున్నామంటూ జగనన్న నాయకత్వంలో పార్టీ భవిష్యత్ మరింత బలపడుతుంది అని ఆయనకు భరోసా ఇచ్చారు.

## అక్రమ నిర్మాణాలు జరపకుండా నిరంతరం పర్యవేక్షించండి

### - కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 25, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనుమ తులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలు, అనుమ తులను మించి నిర్మించిన కట్టడాలను గుర్తించి తొలి దశలోనే నిర్మాణాలను అడ్డుకోవాలని, అక్రమ నిర్మాణా లు జరపకుండా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, ప్రభుత్వ స్థలాలలో నిర్మాణాలు చేపట్ట డం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని, అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు. రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలకు అడ్డంకిగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను, ఆక్రమణలను అన్ని డివిజన్లలో తప్ప నిసరిగా తొలగించి ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టిడ్కో గృహాలకు సంబంధించి చెల్లించిన మొత్తాలను లబ్ధిదారులకు తిరిగి చెల్లించాలని విజ్ఞాపనలు అందుకు న్నా మని, అర్హులైన అందరికీ గృహాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. పట్టణ ప్రణా ళిక విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి అర్జీలు అందుకున్నామని తెలి పారు. ఇంజనీరింగ్ విభాగానికి సంభందించి రోడ్లు, డ్రైను కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను అందుకున్నామని తెలిపారు. రెవెన్యూ విభాగం నుంచి అసెస్మెంట్ మార్పులు, నూతన ఇంటిపన్ను దరఖాస్తులు, ఇంటి పన్నులో మార్పులు తదితర అంశాలపై ఫిర్యాదులను అందుకున్నామని తెలిపారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-6, హౌసింగ్-25, టౌన్ ప్లానింగ్-11, రెవెన్యూ-1, పబ్లిక్ హెల్త్-1, ఆప్కాస్-2, పెన్షన్-7, మొత్తం 53 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ వాసు బాబు, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోగోలు మండలానికి పూర్వ వైభవం తీసుకొస్తా : ఎమ్మెల్యే



**బిట్రగుంట ఆగష్టు 25 ప్రభాతవార్త:** బోగోలు మండలం లోని నాగులవరం పిఏసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం చెంచులక్ష్మీపురం గ్రామంలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోగోలు మండలానికి పూర్వ వైభవం తీసుకొస్తామని, ప్రతి రైతుకు అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన నాగులవరం పిఏసిఎస్ ప్రెసిడెంట్ గా చిలకపాటి వెంకటేశ్వర్లు,డైరెక్టర్లుగా లక్కాకుల మాధవరావు,వాయిల సుధా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన వారు బాధ్యత గా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే కు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మాజీ ఏఎంసి చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, మాజీ సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కండ్లగుంట మధు బాబు నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ ఎం. నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఎల్. సుదీర్ బాబు మాజీ ఎంపీపీ పులిగండ్ల శ్రీరాములు, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు..

## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : సీఐ



**ఉదయగిరి, ఆగష్టు 25, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని ఉదయగిరి పోలీసు సర్కిల్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ వెంకటరావు ఆదివారం తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతం నిమజ్జనం చేసే స్థలం తేదీ వివరాలను కమిటీ వారు పోలీసులకు ముందుగానే తెలియజేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ వారిదేనన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరగాలన్నారు.

## బీసీ భవన్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి



**నెల్లూరు కలక్టరేట్, ఆగస్టు 25, ప్రభాతవార్త** బీసీల రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ జయంతి సందర్భంగా నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్‌కి న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని కొండాయపాలెం గేట్ నందు బీసీ భవన్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి జిల్లా ప్రధాన కేంద్రం నెల్లూరు నగరంలోని ప్రభుత్వ భవనంలో బీసీ వెల్ఫేర్ హాస్టల్, స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి ఎంతో మంది పేద మధ్యతరగతి విద్యార్థులకు ఆశ్రమం కల్పించాలని కోరారు.

## గంజాయి విక్రయదారులు అరెస్ట్

### - 6.3 కిలోల గంజాయి, ఒక ఆటో స్వాధీనం



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** సంతపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కపాడిపాలెం, రూరల్ స్టేషన్ పరిధిలోని కోదూరుపాడు ప్రాంతానికి చెందిన నలుగురు గంజాయి విక్రయ దారులను సంతపేట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన సంబంధించిన వివరాలను సీఐ దశరథ రామారావు వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు కపాడిపాలెం రాయపు వారి వీధికి చెందిన షేక్ సుభాని, సిరాజ్ దంపతులు కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. మన్యం ప్రాంతాల నుండి గంజాయి అక్రమంగా తీసుకువచ్చి నెల్లూరు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన కొండ్ర జ్యోతి అనే మహిళ కూడా గంజాయిని నగరంలో విక్రయిస్తుంటారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై వీరి కదలికలపై నిఘా ఉంచిన సంతపేట పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో వీరి వద్ద కొనుగోలుకు వచ్చిన కోదూరుపాడు కల్తీ కాలనీకి చెందిన షేక్ మీరాను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరందరి వద్ద నుండి 6.3 కిలోల గంజాయి, రూ. 22,500 నగదు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను అదుపులోకి తీసు కోవడంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన స్టేషన్ సీఐ దశరథ రామారావు, ఎస్సై బాలకృష్ణ, ఏఎస్ఐ శ్రీహరి, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, పీసీలు షేక్ అల్లాబక్షు, సురేంద్రబాబు, గోపి, శ్రీకాంత్ ఉమెన్ పీసీలు కుమారి, అనూషలను జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్, డి.ఎస్.పి సింధుప్రియలు అభినందించారు.

## నూతన చైర్మన్‌కు అభినందనలు



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 25, ప్రభాతవార్త** నెల్లూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా ఎన్నికైన మనుబోలు శ్రీధర్‌రెడ్డిని నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ వద్దనున్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో అదే కమిటీలో డైరక్టర్‌గా ఎన్నికైన గునుకుల విజయలక్ష్మీ, ఆమె భర్త గునుకుల కిషోర్, మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె డైరక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా మనుబోలు శ్రీధర్‌రెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. తమ అభినందనలు తెలిపారు.

## దోమల నిర్మూలనకై డ్రైనేజిలలో ఆయిల్ బాల్స్ వేసిన

### చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి ఆగష్టు 25 ప్రభాతవార్త** డ్రై నేజి కాలువలలో వ్యర్ధ పదార్ధాలు వేసి మురునీటి ప్రవాహానికి అంతరాయం కలిగించకండి, దోమలు నిర్మూలను ప్రతి ఒక్కరు కృషి చేయాల ని,ప రిసరాల పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వ్యాప్తి అరికట్టవచ్చునని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం 7 వవార్డు లో జమీలా హాల్ వెనుక గల గుడిపల్లి కాలువ లో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ పరసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వ్యాప్తి అరికట్ట వచ్చునని అన్నారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్‌మోర్ల సుప్రజా మురళీ ఆయిల్ బాల్స్ వేశారు. హోటల్ యజమానులు వ్యర్ధ పదార్ధాలను డస్టు బిన్స్‌లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని అన్నారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, కౌన్సిలర్ రహమత్‌భాషా, క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, మైనార్టీ సెల్ పట్టణ అద్యక్షులు సందాని ,టిడిపి మైనార్టీ నాయకులు అక్తర్,అల్తాప్ మరియు హానీఫ్ ,పఠాన్ మహబూబాషా పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయకుడి విగ్రహ ప్రతిష్ట



**బుచ్చి ఆగష్టు 25 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ లోని శ్రీ భూమి స్క్వేర్ అపార్ట్మెంట్ నందు సోమవారం వినాయక స్వామి విగ్రహప్రతిష్టా నిర్వహించారు. అపా ర్ట్మెంట్‌లో 30 ఇళ్ళకి సంబం దించిన ఓనర్స్ అంతా పాల్గొని విగ్రహ ప్రతిష్ట చేయడం జరిగింది. జొన్నవాడ దేవ స్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమ ణ్యంనాయుడు,13 వవార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ దంపతుల చేతు ల మీదుగా వినాయకునికి అభిషేకం చేయడం జరిగింది. హోమం జరిగిన తరువాత వినాయకుడ్ని విగ్రహ ప్రతిష్ట వేద మంత్రాలతో మంగళ వాయిద్యాలతో అపార్ట్మెంట్‌లోని 30 మంది దంపతులు పాల్గోనడం జరిగింది.

## గ్రామాలలో నూతన స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణి



**చేజర్ల ఆగష్టు 25 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబా బునాయుడు రాష్ట్ర అభివృద్దిలో భాగంగా ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పదకాలను ప్రజలందరికి చేరువ చేసేందుకు నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో సోమవారం కూటమి నాయకులు ,అధికారులు చేతులు మీద పంపిణి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు గ్రామాలలో కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయడం జరిగింది. తూర్పు కంభం పాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీనాయకులు మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివాసులునాయుడు, మాజీ సర్పంచ్ కొమ్మి రమేష్‌నాయుడు ఆద్వర్యంలో స్మార్ట్ రైసు కార్డులు పంపిణి చేశారు. అలాగే కొలపనాయుడు పల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకులు అచ్చాల నారాయణరెడ్డి ఆద్వర్యంలో నూతన రైస్‌కార్డులను మహిళలకు అధికారులు పంపిణి చేయడం జరిగింది. వావిలేరు గ్రామ సర్పంచ్ గోనుగుంట రాంబాబు ఆద్వర్యంలో స్మార్ట్ రైసు కార్డులను అందజేయడం జరిగింది. మామూడురు గ్రామంలో ఆరెద్దుల రామకృష్ణయ్య ఆద్వర్యంలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణి చేశారు. అలాగే మిగిలిన గ్రామ సచివాలయాలలో కూటమి నాయకులు, రెవిన్యూ అధికారులు,సచివాలయ అధికారులు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణి చేశారు.

## రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ



**దగదర్తి, ఆగష్టు 25, ప్రభాతవార్త** దగదర్తి మండల ప్రాంతమైన దగదర్తి గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు మాల ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ అశోక్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. వారు మాట్లాడుతూ ఐక్యవేదిక, ఉద్యోగ సంఘం జేఏసీ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను రెండు రోజుల్లోనే ఇంత మందిని గ్యాదర్ చేయడం అలాగే అణగారిపోయిన నా మాల జాతిని ఏకం చేయడం చాలా సంతృప్తినిస్తుందని భవిష్యత్తులో మరెన్నో ఉద్యమాలు మరెన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అశోక్‌బాబు, మార్పుడి మాచర్ల, కుందుర్తి వెంకటేశ్వర్లు, జూపూడి మల్లయ్య, జూపూడి భాస్కర్, జూపూడి రాము, జూపూడి కిరణ్ కుమార్, తాటిచెట్ల వినోద్, జూపూడి కుమార్, పైడి అశోక్, బొందు సుబ్బారావు, బొందు మణి, జూపూడి రమేష్, జూపూడి ప్రభాస్, మార్పుడి అనిల్, కలికి శ్రీనివాసులు, చీకటి తిరుపతి, పైడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు మెరుగైన సదుపాయాలు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 25, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజలు సులభంగా తమ సమస్యలపై అర్జీలు అందజేసేలా పలుసౌకర్యాలు కల్పించారు.

**- అర్జీలు రాసే కేంద్రం..** ప్రధానంగా జిల్లా నలుమూలల నుండి వచ్చే ,అర్జిదారుల కోసం ప్రభుత్వ ఉద్యోగులను కేంద్రంలో కూర్చోబెట్టి వచ్చే అర్జీదారుల వివరాలు సేకరించి పి జి ఆర్ ఎస్ అప్లికేషన్ పై ఆ సమస్య రాసి పంపిస్తారు.

**- ఆన్లైన్ కేంద్రం....** ఆన్లైన్ కేంద్రంలో వివిధ రకాల ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు అర్జిదారులు తమ సమస్య అర్జీలు అక్కడికి తీసుకువెళ్తే అప్లికేషన్ ఆన్లైన్ చేసి అక్నాలజిమెంట్ ఇస్తారు.

**- టోకెన్ సిస్టం....** అర్జీదారులు ఆన్లైన్ చేసుకున్న తర్వాత తిక్కన ప్రాంగణంలోజరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు, తమ సమస్య తెలియజేయడానికి , క్రమ పద్ధతిలో టోకెన్ సిస్టం పెట్టడం జరిగింది. ఈ పద్ధతి వల్ల, అర్జీదారులు ఎటువంటి తొందరపాటు లేకుండ క్రమ పద్ధతిలో లోపలికి ,తమ నెంబరు ప్రకారం వెళతారు.

**- మధ్యాహ్నం భోజనం** సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే అర్జీదారుల కోసం మంచి రుచి గల భోజనం ఏర్పాటు.

**- తాగునీటి సదుపాయం..** తిక్కన ప్రాంగణంలో ప్రత్యేక నీటి క్యాన్‌ల ఏర్పాట్లు చేయడం జరిగింది. ఎండల తీవ్రత ప్రజల ఇబందులు పడకుండా ఏర్పాటు చేసారు.

**- వైద్య శిబిరం** బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉచిత మందులు పంపిణీ ప్రతి సోమవారం నిర్వహిస్తున్నారు.

**- దివ్యాంగుల కోసం వీల్‌చైర్**

దివ్యాంగుల ఏదో ఒక సమస్యలతో ప్రతి సోమవారం పరిష్కరా వేదికకు వస్తుంటారు. నడవలేని స్థితి. వారిని నేరుగా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లే సదుపాయం ఏర్పాటు చేసి అక్కడ ఒక వ్యక్తిని ఏర్పాటు చెయడం జరిగింది.

**- కాల్ సెంటర్ 1100..** ప్రతి అర్జీని ఆన్లైన్లో నమోదు చేసి అర్జీ స్టేటస్‌ను తెలుసుకునేందుకు కాల్ సెంటర్ 1100 నంబర్ ఏర్పాటు. ప్రజలు నేరుగా ఈ కాల్ సెంటర్ నెంబర్ కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు .

**- ప్రతి సమస్యకు పరిష్కారం..** ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ. ఈ సౌకర్యాల పట్ల అర్జీదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సూపర్ సిక్స్.. బంపర్ హిట్

### కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళలు

### స్త్రీ శక్తి విజయోత్సవ సభలో అతివల హర్షాతిరేకాలు



**కోవూరు , ఆగస్టు 25 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అతివలు సంతోషం వ్యక్తం చేశారు. తమ జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తుండటంపై హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. కోవూరులో జరిగిన స్త్రీ శక్తి విజయోత్సవ సభలో పలువురు మహిళలు తమకు కలిగిన లబ్ధిపై తమ సంతోషాన్ని ఇలా పంచుకున్నారు.. అరుణమ్మ, కోవూరుచిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు స్త్రీ శక్తి కొండంత అండగా నిలుస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా నెలకు 2 వేల రూపాయలకు పైగా లబ్ది కలుగుతోంది. ఆదా అవుతున్న డబ్బులు పాలు, కూరగాయల ఖర్చులకు వెచ్చిస్తున్నా. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై మాకు ఎంతో సంతోషంగా ఉంది. మా సంక్షేమానికి పెద్ద వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ప్రత్యేక ధన్యవాదాలు. మాకు ఇంత ధైర్యం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు. సరితమ్మ, విడవలూరుకూలీ, నాలీ చేసుకునే బతికే నేను డబ్బులుంటేనే గ్యాస్ బుక్ చేసుకునేదాన్ని. డబ్బులు అందుబాటులో లేని సమయాల్లో కట్టెల పొయ్యి పైనే వంట చేసుకుంటా. దాంతో తీవ్ర ఇబ్బందులు పడేదాన్ని. చంద్రబాబు నాయుడు గారు అధికారం లోనికి వచ్చాక దీపం 2 పథకం ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా ఇస్తుండడంతో కట్టెల పొయ్యి బాధ తప్పింది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చాలా సంతృప్తిగా ఉంది. లావణ్య, కోవూరుఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ తల్లికివందనం పథకం ఇస్తారని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు గారు హామీ ఇచ్చారు. అయితే దీనిపై తొలుత నాకు అనుమానాలు ఉండేవి. కానీ ఇచ్చిన మాట మేరకు ఏడాది కాలంలోనే తల్లికి వందనం కింద ఎంతమంది ఉన్నా అందరికీ డబ్బులు జమ చేశారు. దాంతో నా ఆనందానికి అవధులు లేవు. డబ్బులు డ్రా చేసి పిల్లల స్కూలు ఫీజులు కట్టా. సీఎం చంద్రబాబు నాయుడు గారు మాటల మనిషి కాదు. చేతల మనిషి. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కష్టపడుతున్నారు.

## ఉత్తర కాలువ నీటితో చేరువులు నింపేందుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే



**కలిగిరి, ఆగష్టు25ప్రభాతవార్త** కలిగిరి మండలంలోని కలిగిరి పెద్ద చెరువుతో పాటు, మండలంలోని అన్ని చెరువులకు ఉత్తర కాలువ నిటి ద్వారా చెరువులకు నీరు నింపేవిదంగా కృషి చేస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం కలిగిరి మండలంలోని చిన్న అన్నలూరు ఆగ్రహారంలోని శ్రీ వేణు గోపాల స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిధిగా పాల్గోన్నారు. మా ట్లాడుతూ అతి పూరతనమైన దేవస్థానాలలో శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఒకటి అని, విస్తారమైన భూములు, విస్తారమైన ప్రాంగణం వున్న గుడి ఇప్పటి వరకు దూప,దిప నైవేద్యాలకు కూడా ఇబ్బందులు వున్న స్థితిలో ఈ గుడికి పాలక మండలి నియామకం ఇప్పుడు జరిగిందన్నారు. గుడి రూపకల్పనకు తన వంతు కృషి చేస్తానని, ఈ ప్రాంత ప్రజలకు గుడిని అందుబాటులోకి తీసుకోని వచ్చి నిత్య పూజలు జరిగేలా కృషి చేయడం జరుగు తుందన్నారు. అలాగే నూతన పాలకమండలి సైతం గుడి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ గుడి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. తదుపరి వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్యక్షునిగా వేము లూరి ప్రసాద్, సభ్యులుగా గంగిశెట్టి సురేష్, గుంటూరు శ్రీధర్, టి. నాగలక్ష్మీ, బత్తల వెంకమ్మ, ఆర్.లక్ష్మమ్మ, శ్రీరాం సుబ్బరత్నమ్మ, తాళ్ళురు సుధాకర్,గంగవరపు శ్రీనివాసులు, గుంటూరు కృష్ణమూర్తి, తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఆయన చిన్న అన్నలూరు పంచాయితీలోని ప్రజలకు నూతన రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లడుతూ గుడికి సుమారు 410 ఎకరాలు విలువైన భూములు వున్నాయని, వీటి విలువ సుమారు రూ.70 కోట్ల వంకు వుంటుందన్నారు. అయినప్పటికి గుడి అలనా,పాలనా చూసే వారే కురువైపోయరన్నారు. ఆలయ పునర్నిర్మాణాన్ని జరిపి పునరుద్దరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వినర్ బిజ్జం కృష్ణా రెడ్డి, నాయకులు చీమల తాతయ్య, బాసర నరసింహులు, రావలకోల సర్పంచ్ వేంగపరాయుడు, గోవిందయ్య, కోండప నాయుడు, మదన్ తదితరులున్నారు.

## త్వరలో చలో అన్నవరం క్వారీ

### - మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**కావలి, ఆగస్టు 25 ప్రభాత వార్త:** త్వరలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కి సంబంధించిన జలదంకి మండలం అన్నవరం వద్ద ఉన్న క్వారీ వద్దకు చలో అన్నవరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందనీ మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి తెలియజేశారు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కుటుంభ సభ్యులను సోమవారం మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ,కాకాని పూజితలు పరామర్శించడం జరిగింది అనంతరం మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కేసులలో ఉన్న వారి కుటుంబ సభ్యుల జోలికి వేస్తే సహించేది లేదని తెలియజేశారు ఎమ్మెల్సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కుటుంభం సభ్యులను పోలీసులు వేధిస్తున్నారనీ ఇది ఎంతవరకు సమంజసమని తెలిపారు జలదంకి మండలం, అన్నవరంలో జరిగిన డ్రోన్ ఘటన నిజం అని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కి తెలియదా అన్నారు మాకంటే మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మంచి వ్యక్తినే విషయం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కి తెలుసుఅన్నారు ఈ విధంగా అసత్య కేసులు పెట్టడం ఏమిటనీ ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు